29న దీక్షా దివస్

- రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహణ
- కరీంనగర్‌లో పాల్గొననున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గకేంద్రాల్లో ఈ నెల 29న దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. కరీంనగర్‌లో జరిగే దీక్షా దివస్‌లో తాను పాల్గొంటానని తెలిపారు. తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర సాధనలో అత్యంత కీలకమైన ఘట్టంగా దీక్షా దివస్ నిలుస్తున్నది. 2009 నవంబర్ 29న భారత రాష్ట్ర సమితి (అప్పటి టీఆర్ఎస్) అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతో మలిదశ ఉద్యమం ఉవ్వెత్తిన ఎగిసి స్వరాష్ట్ర సాధనకు బలమైన పునాదులు పడిన సంగతి తెలిసిందే. దీక్షకు వెళ్లే ముందు 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే తెగింపుతో చేపట్టిన ఈ దీక్ష తెలంగాణలోని సబ్బండవర్గాలను ఏకం చేసింది. యావత్ భారత దేశ రాజకీయ వ్యవస్థను కదిలించి, చరిత్రలో తొలిసారి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం స్వయంగా ప్రకటన చేసేలా చేసి దశాబ్దాల తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చింది.

సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

రాజన్న గుడిని అభివృద్ధి చేసిందే కేసీఆర్

- ప్రభుత్వ వేదికపై రాజకీయ విమర్శలా?
- ముఖ్యమంత్రి రేవంత్‌పై మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ ఫైర్

సిరిసిల్ల టౌన్, నవంబర్ 21 : కేసీఆర్ హయాంలోనే వేములవాడ రాజన్న ఆలయం అభివృద్ధి చెందిందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. వేములవాడ సభలో సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేరును రామనామంలా జపిస్తున్నాడని తెలిపారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు చేసిందని రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని అన్నారు. వేములవాడలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమ వేదికను రాజకీయ సభగా మార్చుకున్నారని ధ్వజమెత్తారు. గత కాంగ్రెస్ పాలనలో ఉరిశిలగా ఉన్న సిరిసిల్ల సిరిశాలగా మారడానికి కారణం కేటీఆర్ చేసిన కృషి ఫలితమేనని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్దికాలంలోనే మళ్లీ ఆత్మహత్యలు మొదలయ్యాయని ఆరోపించారు. ఎడారి ప్రాంతంగా ఉన్న రాజన్న సిరిసిల్ల జిల్లాను కోనసీమగా మార్చింది కేసీఆర్ అని స్పష్టంచేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు కుప్పకూలిపోయాయని రాజన్న సాక్షిగా అబద్ధాలు చెప్పడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని అన్నారు. ప్రాజెక్టులు కూలిపోతే కొండపోచమ్మ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్‌కు నీళ్లు ఎట్లా వస్తున్నాయో చెప్పాలని ప్రశ్నించారు. హెలికాప్టర్‌లో వచ్చిన రేవంత్‌రెడ్డికి మిడ్‌మానేరు ప్రాజెక్టులోని నీరు కనిపించలేదా? అని నిలదీశారు.

నా భూమి సర్వే చేసుకో

మొదటిపేజీ తరువాయి...

మండలంలోని మనసాన్‌పల్లిలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపనకు హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై భూకబ్జా ఆరోపణలు చేసిన రేవంత్‌రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. రంగనాయక్ సాగర్‌లో ఇరిగేషన్ భూమిని కబ్జా చేశానని తనపై రేవంత్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని.. కబ్జాల చరిత్ర రేవంత్‌రెడ్డికి ఉన్నదని ధ్వజమెత్తారు. రంగనాయక్ సాగర్ దగ్గర రైతుల పట్టాపాస్‌పుస్తకాలు తీసుకుని, ధరణి ద్వారా రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కు వెళ్లి 13 ఎకరాల పట్టా భూమిని నిబంధనల మేరకు తాను కొనుగోలు చేసినట్టు చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీస్తున్నందుకు తనను రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రుణమాఫీ అమలులో సర్కార్ విఫలమైందని, పిల్లలకు పురుగుల అన్నం, విషాహారం తినిపించటంతో దవాఖానల పాలవుతున్నారని రేవంత్‌రెడ్డిని నిలదీశానని, రేవంత్ అధికారంలోకి వచ్చాక 42 మంది పిల్లలు చనిపోయారని కాంగ్రెస్ ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపితే తనను బ్లాక్‌మెయిల్ చేసే ప్రయత్నం చేస్తున్నాడని మండిపడ్డారు. తమను ఎన్ని విధాలుగా బ్లాక్‌మెయిల్ చేసినా.. రైతులు, ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని తాము ప్రశ్నిస్తూనే ఉంటామని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలను అమలు చేసేదాకా నిలదీస్తూనే ఉంటామని స్పష్టంచేశారు.

సంగారెడ్డి జిల్లా అందోలు మండలం మాసాన్‌పల్లిలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలకు హాజరై భక్తులకు అభివాదం చేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

ధాన్యం దళారుల పాలు

ధాన్యం సేకరణలో రేవంత్ సర్కార్ ఘోరంగా విఫలమైందని హరీశ్ విమర్శించారు. కనీసం వడ్లయినా కొనుగోలు చేసి మద్దతు ధర కల్పిస్తారని ఆశించిన రైతులకు ఈ ప్రభుత్వంలో భంగపాటే మిగిలిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా కొనుగోళ్లు జరగక రైతులు రూ.500 తక్కువకు దళారులకు వడ్లు అమ్ముకుంటున్నారని వాపోయారు. 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటామని మంత్రి ఉత్తమ్ చెప్పగా పౌరసరఫరాల కమిషనర్ చౌహాన్ 70 లక్షలే కొంటామని చెప్పడం విడ్డూరంగా ఉన్నదని అన్నారు. 40 నుంచి 50 లక్షల మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ ధాన్యం ప్రభుత్వం కొనే పరిస్థితిలేదని తెలిపారు. ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించినా రైతులు ప్రస్తుతం రూ.500 తక్కువ ధరకే ధాన్యం అమ్ముకుంటున్నారని చెప్పారు. ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్సీలకు ఆసైన్డ్‌భూముల పట్టాలు ఇస్తామని చెప్పి ఇప్పటికీ ఇవ్వలేదని, కానీ ఎస్సీ, ఎస్టీల భూములను మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం కొల్లగొడుతున్నదని మండిపడ్డారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజీ జడ్పీ చైర్మన్ బాలయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మఠంభిక్షపతి, జైపాల్‌రెడ్డి, పట్నం మాణిక్యం, సాయికుమార్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రిశాంక్‌పై మధ్యప్రదేశ్‌లో కేసు

- భోపాల్‌లో కోర్టుకు రావాలని నోటీస్
- 11 నెలల కాంగ్రెస్ పాలనలో 11 కేసులు
- వాస్తవాలు బయట పెడుతున్నందుకే టార్గెట్?
- అన్ని కేసుల్లోనూ ప్రభుత్వం అభాసుపాలు

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధికార ప్రతినిధి, తెలంగాణ ఉద్యమ నాయకుడు మన్నె క్రిశాంక్‌పై మరో కేసు నమోదైంది. సోం డిస్టిలరీ అండ్ బ్రూవరీ కంపెనీపై చేసిన ఆరోపణలపై భోపాల్ కోర్టు నుంచి క్రిశాంక్‌కు నోటీసులు పంపించారు. ఈనెల 18న భోపాల్‌లోని కోర్టుకు హాజరు కావాలని పంపిన నోటీసులు ఆలస్యంగా ఈ నెల 21న అందాయని క్రిశాంక్ ఎక్స్ వేదికగా గురువారం వెల్లడించారు. తాను చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ ప్రభుత్వం పరోక్షంగా సోం డిస్టిలరీ కంపెనీతో తనపై కేసు వేయించిందని క్రిశాంక్ పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి సోం డిస్టిలరీ కంపెనీ రూ.575 కోట్ల మేర రుణాలు ఎగ్గొట్టిందని గత మేలో ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఆ బీరు కంపెనీతో తెలంగాణను కూడా లూటీ చేయడానికి దానిని ఇక్కడికి తీసుకొస్తున్నారా? అని క్రిశాంక్ నాడు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి మన్నె క్రిశాంక్‌పై కాంగ్రెస్ సర్కారు కత్తిగట్టింది. ఆధారాలు లేని కేసులను మోపి ఇరుకున పెట్టాలని చూస్తున్నది. ఇలా కాంగ్రెస్ 11 నెలల పాలనాకాలంలో నెలకొకటి చొప్పున 11 కేసులు ఆయనపై మోపింది. అన్ని కేసుల్లోనూ ప్రభుత్వం అభాసుపాలవుతున్నా, మరో కేసులో టార్గెట్ చేస్తూ కక్షసాధింపు చర్యలకు దిగుతున్నది. తప్పుడు కేసుల్లో క్రిశాంక్‌ను బలవంతంగా ఇరికించేందుకు ప్రభుత్వం, పోలీసులు తప్పుమీద తప్పులు చేస్తూనే ఉన్నారు. గత మే నెలలో ఓయూ పీఎస్‌లో నమోదైన ఓ కేసులో చౌటుప్పల్‌లోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అదుపులోకి తీసుకున్నారు. బెయిల్ రానీయకుండా అదేనెల 9 వరకు వివిధ స్టేషన్లు, కోర్టులు తిప్పుతూ ఇబ్బందులు పెట్టారు. ఆఖరికి కోర్టు మొట్టికాయలు వేస్తే కానీ ఆయనను విడుదల చేయలేదు.

11 నెలల్లో క్రిశాంక్‌పై నమోదైన 11 కేసులు

1. సోషల్ మీడియా పోస్టుపై అప్పటి కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాపూర్ పీఎస్‌లో కేసు. క్రిశాంక్ ఫోన్ జప్తు.
2. కాంగ్రెస్ నాయకుడు సుదర్శన్‌పై సోషల్ మీడియా పోస్టుకు పేట్ బషీరాబాద్‌లో కేసు నమోదు.
3. గన్‌పార్కు అమరవీరుల స్థూపం వద్ద నిరసన తెలిపినందుకు కేసు
4. సైబర్ క్రైమ్‌లో ఎఫ్ఐఆర్ నం.680/2024 కేసు నమోదు.
5. ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యుత్తు కోతలపై సీఎం తప్పుడు సర్క్యులర్, ఒరిజినల్ కాపీ పెట్టిన క్రిశాంక్‌కు 10 రోజుల చంచల్‌గూడ జైలు శిక్ష.
6. రేవంత్ ప్రధాన అనుచరుడు ఫహీం ఖురేషీపై సోషల్ మీడియా పోస్ట్ పెట్టినందుకు సైబర్ క్రైమ్‌లో కేసు
7. 'అసెంబ్లీలో కేటీఆర్ ప్రసంగం మధ్యరాత్రి వరకు నడిచినా, సీఎం రేవంత్ గైర్హాజరు ఎక్కడ నిద్రపోయిండు' అని పెట్టిన సోషల్ మీడియా పోస్టుకు సైబర్ క్రైమ్‌లో కేసు
8. ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి ముందు గోడ కట్టినందుకు మీడియాతో మాట్లాడినందుకు క్రిశాంక్, కేటీఆర్‌పై అడిషనల్ డీజీ మహేశ్ భాగవత్‌కు ముగ్గురు కాంగ్రెస్ కార్పొరేటర్ల ఫిర్యాదు
9. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయ ఘటనపై ట్వీట్ చేసినందుకు క్రిశాంక్ అకౌంట్‌పై ట్విట్టర్‌కు సైబర్ క్రైమ్ పోలీసుల ఫిర్యాదు
10. మూసీ నది కాంట్రాక్టు పాకిస్థాన్‌లో కుంభకోణం చేసి పరారైన మెయిన్ హార్ట్ సంస్థపై పోస్టులు పెట్టినందుకు ఆ సంస్థ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోద్బలంతో లీగల్ నోటీసులు
11. కాంగ్రెస్ ప్రభుత్వం సోం డిస్టిలరీస్ అనే బీరు కంపెనీకి అనుమతులు ఇవ్వడాన్ని బయట పెట్టినందుకు, ఆ కంపెనీపై ఉన్న ఆరోపణలను బట్టబయలు చేసినందుకు, భోపాల్ కోర్టులో క్రిశాంక్‌పై కేసు నమోదు. భోపాల్ కోర్టుకు హాజరుకావాలని సమన్లు.



సీఎం రేవంత్‌పై చర్యలు తీసుకోండి

- బీజేపీ నేతలకు ఇదే సువర్ణావకాశం
- మాజీ మంత్రి వేముల సూచన

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): ప్రముఖ పారిశ్రామికవేత్త అదానీ వ్యవహారాలపై తెలంగాణలో విచారణ జరిపి, నిజాలను వెలుగులోకి తీసుకొచ్చి సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి గురువారం ఎక్స్ వేదికగా డిమాండ్‌చేశారు. అదానీ వ్యవహారాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్వయంగా కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ సూచించారని, బీజేపీ పెద్దలు, కేంద్రమంత్రులైన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు ఇదో సువర్ణావకాశమని పేర్కొన్నారు. దమ్ముంటే రేవంత్‌పై విచారణ జరిపించాలని సూచించారు.'ఏ రాష్ట్రంలో అయిన అదానీ వ్యవహారాలపై విచారణ జరిపి, ఆయన వెనుక ఉన్న కీలక వ్యక్తులను గుర్తించి, చర్యలు తీసుకోవాలని, తప్పులు తేలితే జైలులో వేయాలి' అన్న రాహుల్ వ్యాఖ్యల వీడియోను తన పోస్టుకు వేముల జతచేశారు.

కేసీఆర్.. తెలంగాణ గాంధీ

ఇకపై రాజకీయాలు మాట్లాడను: వైసీపీ నేత పోసాని కృష్ణమురళి

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ గాంధీ అని వైసీపీ నేత, సినీ రచయిత పోసాని కృష్ణమురళి అభివర్ణించారు. రాష్ట్రం వచ్చేందుకు ముఖ్య కారణం కేసీఆరేనని తెలిపారు. హైదరాబాద్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ఇకపై నేను రాజకీయా లు మాట్లాడను. నా జీవితాంతం రాజకీయాల జోలికి పోను. నా చివరి శ్వాస వరకు కుటుంబం కోసమే బతుకుతా. ఇన్నేండ్ల జీవితంలో నేను ఎవరికీ తలవంచలేదు' అని పేర్కొన్నారు. ఆడవాళ్లనే ఇష్టమొచ్చినట్టు తిడుతున్నారు.. తాను మగవాడినని, తనను తిట్టరా? అయినా, వాటిని పట్టించుకోనని తెలిపారు.

బీఆర్ఎస్ కార్యకర్తను విడుదల చేయాలి

- ప్రసాద్‌రాజును మేజిస్ట్రేట్ ఎదుట ప్రవేశపెట్టాలి
- మానవ హక్కుల వేదిక డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 21(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ కార్యకర్త నలగాటి ప్రసాద్‌రాజును వెంటనే విడుదల చేయాలని మానవ హక్కుల వేదిక తెలుగు రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు ఎస్ జీవన్‌కుమార్, తెలంగాణ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ తిరుపతయ్య డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని కొత్తపేట ప్రాంతంలో నివాసముంటున్న ప్రసాద్ రాజును గురువారం తెల్లవారుజామున మఫ్టీలో వచ్చిన పోలీసులు తీసుకెళ్లారని, ఆయన భార్య విజయలక్ష్మి(ప్రభుత్వ ఉపాధ్యాయురాలు) ఫిర్యాదు చేసిందని తెలిపారు. తన భర్త బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారని, ఆయనపై ఏ కేసులూ లేవని, ఆయన భద్రతపై భయాందోళనగా ఉన్నదని విజయలక్ష్మి తమను ఆశ్రయించినట్టు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రసాద్‌రాజును వెంటనే మేజిస్ట్రేట్ ఎదుట ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో నేడు తీర్పు!

హైదరాబాద్, నవంబర్21 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలనే వ్యాజ్యాలపై సింగిల్‌జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి వీ నర్సింహాచార్యులు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు శుక్రవారం తీర్పు వెలువరించనుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్లను అనుమతిస్తూ సింగిల్‌జడ్జి సెప్టెంబర్ 9న ఇచ్చిన తీర్పును కొట్టేయాలని దాఖలైన రెండు పిటిషన్లపై హైకోర్టు డివిజన్ బెంచ్ ఈ నెల 12న వాదనలు ముగించింది.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించనుంది.సింగిల్‌జడ్జి తీర్పును రద్దు చేయాలని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదించారు. దీనిపై బీఆర్ఎస్ తరపు సీనియర్ న్యాయవాదులు మోహన్ రావు, జే రామచందర్‌రావు ప్రతివాదనలు చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారంలో సింగిల్‌జడ్జి జోక్యం చేసుకోలేదని తెలిపారు. ఫిరాయించిన ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసేందుకు వెళితే స్పీకర్‌కు పిటిషన్ తీసుకోలేదని, అందువల్లే హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు.

రాష్ట్రంలో అభివృద్ధి స్విచ్ఛాఫ్

- ప్రజల గుండెల్లో కేసీఆర్ పేరు
- మాజీ మంత్రి గంగుల కమలాకర్

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి ఒక్కసారిగా స్విచ్ఛాఫ్ చేసినట్టు ఆగిపోయిందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ధ్వజమెత్తారు. నిధులు విడుదల కాక అభివృద్ధి పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలోనే మానేరు రివర్ ఫ్రంట్ పనులు 90 శాతం పూర్తయ్యాయని, ఏడాది కాంగ్రెస్ పాలనలో తట్టెడు మట్టి కూడా తీయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కరీంనగర్ జిల్లా ప్రజలపై రేవంత్‌రెడ్డికి ఎందుకింత కక్ష అని నిలదీశారు. తెలంగాణభవన్‌లో గురువారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు డాక్టర్ కే సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, పార్టీ నేతలు రూప్‌సింగ్, పన్నాల భూపతిరెడ్డితో కలిసి గంగుల మీడియాతో మాట్లాడారు. నిన్న సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడకు వస్తే ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఏవైనా నిధులు, వరాలు ప్రకటిస్తారని ఆశించామని, కానీ, ఆయన అభివృద్ధి ఊసే ఎత్తలేదని విమర్శించారు. ఎంతసేపూ కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తామనడం తప్ప రేవంత్ కొత్తగా చెప్పిందేమీ లేదని ఎద్దేవాచేశారు. కేసీఆర్ పేరు చెరిపేసేందుకు బ్లాక్ బోర్డు మీద రాసిన చాక్‌పీస్ రాతకాదని, కేసీఆర్ పేరు తెలంగాణ ప్రజల గుండెల్లో సువర్ణాక్షరాలతో లిఖించి ఉన్నదని చెప్పారు. భూమి, నీరు ఉన్నంత వరకు కేసీఆర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. కేసీఆర్ కుటుంబాన్ని తిట్టడం మీద కాకుండా అభివృద్ధి మీద రేవంత్‌రెడ్డి దృష్టిపెట్టాలని హితవుపలికారు. కోకాపేటలో బీసీలకు కేసీఆర్ 82 ఎకరాలు కేటాయించారని, కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ ప్రకటించి ఏడాదిన్నరైనా ఏం చేసిందని నిలదీశారు. 29న కరీంనగర్‌లో దీక్ష దివస్‌ను ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి గంగుల కమలాకర్. చిత్రంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, పార్టీ నేతలు రూప్‌సింగ్, పన్నాల భూపతిరెడ్డి

రేవంత్ చేసిందేంది?: పాడి

ఏడాది పాలనలో రేవంత్‌రెడ్డి చేసింది ఏమిటని? కేసీఆర్ పథకాలను బంద్ పెట్టడం తప్ప కొత్తగా ఏం పథకాలు అమలు చేశారని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిలదీశారు. మహబూబాబాద్‌లో అంతమంది పోలీసుల కవాతు దేనికని, కేటీఆర్ మీటింగ్‌కు పర్మిషన్ ఇవ్వడానికి రేవంత్‌కు భయమెందుకని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు పేరు లేకుండా ఈ ఏడాదిలో రేవంత్‌రెడ్డి ఏ మీటింగయినా పూర్తిచేశారా? అని ప్రశ్నించారు. 'రేవంత్ కూర్చుంటున్న సచివాలయం కేసీఆర్ కట్టించింది కాదా? రేవంత్ సెటిల్‌మెంట్లకు వాడుకుంటున్న పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ కేసీఆర్ కట్టించింది కాదా? తెలంగాణలో ఎక్కడైనా కేసీఆర్ ఆనవాళ్లే ఉంటాయి.. వాటిని తొలగించడం రేవంత్ వల్ల అవుతుందా?' అని చురకలంటించారు. విజయోత్సవాల పేరుతో గ్రామాల్లో వాహనాలను తిప్పుతున్నారని, ప్రజలు కొడతారనే భయంతో కళాకారులు ఎక్కడా వాటిని ఒక్క నిమిషం కూడా ఆపడం లేదని ఎద్దేవాచేశారు. రెండో విడత దళితబంధు నిధులు ఎందుకు విడుదల చేయడం లేదని నిలదీశారు. వేములవాడ సభలో సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్ కుటుంబంపై చేసిన అడ్డగోలు వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు చెప్పారు.

రేవంత్‌ను ప్రజలు తిడుతున్నరు: కొప్పుల

తన 40 ఏండ్ల రాజకీయ జీవితంలో ప్రజల చేత ఇన్నితిట్లు తిట్టించుకుంటున్న సీఎంను చూడలేదని, రేవంత్‌రెడ్డిని ప్రజలు ఘోరంగా తిడుతున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. ఏదో అనుకొని కాంగ్రెస్‌కు ఓటేశామని ఇప్పుడు ప్రజలంతా బాధపడుతున్నారని చెప్పారు. మాట్లాడితే అరెస్టులు చేస్తామంటున్న రేవంత్‌రెడ్డి.. దమ్ముంటే తమ బీఆర్ఎస్ నేతలను ఎప్పుడు, ఎక్కడ, ఏ కేసులో అరెస్టు చేస్తారో చెప్పాలని సవాల్ విసిరారు. వేములవాడ, సిరిసిల్ల రూపురేఖలు మార్చిన ఘనత కేసీఆర్‌దేనని గుర్తుచేశారు. '50 వేల ఉద్యోగాలు ఇచ్చామంటున్నారు.. నోటిఫికేషన్లు కేసీఆర్ ఇచ్చారా? రేవంత్ ఇచ్చారా?' అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో దౌర్జన్యంగా భూ సేకరణ జరగలేదని, రైతులను ఒప్పించి మెప్పించి సేకరించారని గుర్తుచేశారు. ఫార్మాసిటీ కోసం సేకరించిన 14 వేల ఎకరాలు ఉండగా, మళ్లీ ఫార్మాకు భూ సేకరణ ఎందుకు? అని నిలదీశారు.

తెలంగాణ పోలీస్ అకాడమీకి వచ్చిన ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తున్న డీజీపీ

పోలీసు అకాడమీకి ఐఎస్‌వో సర్టిఫికెట్

- దేశంలో ఫైవ్ స్టార్ రేటింగ్ అందుకున్న తొలి అకాడమీ
- కేసీఆర్ హయాంలోనే శిక్షణకు మౌలిక వసతుల కల్పన

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పోలీసు అకాడమీకి ప్రతిష్ఠాత్మకమైన ఐఎస్‌వో సర్టిఫికెట్ వచ్చింది. దేశంలోనే ఫైవ్ స్టార్ క్వాలిటీ రేటింగ్ అందుకున్న మొదటి పోలీసు అకాడమీగా.. టీజీపీఏ నిలిచింది. ఈ మేరకు ఐఎస్‌వో ప్రతినిధులు గురువారం డీజీపీ జితేందర్, పోలీసు అకాడమీ డైరెక్టర్, డీజీ అభిలాష బిస్త్‌కు ఐఎస్‌వో సర్టిఫికెట్ ప్రదానం చేశారు. నాణ్యమైన ఆహార ప్రమాణాలు, క్యాంటీన్ శుభ్రత వంటి అంశాలతోపాటు నాణ్యమైన శిక్షణ, పర్యావరణ వసతులు వంటి పలు అంశాల్లో జాతీయ స్థాయిలో 5 స్టార్ రేటింగ్ సాధించడంతో ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. అవార్డు రావడంపై డీజీపీ జితేందర్ హర్షం వ్యక్తం చేస్తూ అధికారులను అభినందించారు.

కేసీఆర్ హయాంలోనే వసతులు..

రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి తెలంగాణ పోలీసు అకాడమీ 150కి పైగా ఎకరాల్లో విస్తరించి ఉన్నది. ఇక్కడ కానిస్టేబుల్ నుంచి ఎస్సై ఆపై స్థాయి, గ్రూప్ -1ద్వారా ఎంపికైన డీఎస్పీలకు శిక్షణ ఇస్తారు. ఇక్కడ ఇచ్చే వెపన్ డ్రిల్ పోలీస్ శిక్షణలో ప్రధానమైనది. 9ఎంఎం పిస్టల్, 9ఎంఎం కార్బన్, ఏకే 47 లాంటి 11 రకాల వెపన్స్ వినియోగంపై శిక్షణ ఇస్తారు. అత్యంత కీలకమైన అవుట్ డోర్ శిక్షణలో వ్యాయామం, జంగిల్ క్రాసింగ్, రోప్ క్లైంబింగ్, ఫైర్ మెన్ లిఫ్టింగ్, డిస్, క్యాట్ వాక్ తదితర వాటిపై తర్ఫీదునిస్తారు. సైబర్ ల్యాబ్‌లు, విశాలమైన క్యాంటీన్లు, ఆధునిక భవనాలు, క్రీడా మైదానాలు వంటి వాటి కల్పనకు నాటి సీఎం కేసీఆర్ విశేష కృషిచేశారు. స్వరాష్ట్రంలో మరిన్ని నిధులు కేటాయించి.. దేశంలోనే అత్యుత్తమ ట్రైనింగ్ సెంటర్‌గా తీర్చిదిద్దారు. నాడు కేసీఆర్ కల్పించిన మౌలిక వసతుల ఫలితంగా నేడు ప్రతిష్ఠాత్మక ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను పోలీసు అకాడమీ సొంతం చేసుకున్నది.

ఓయూ లైబ్రెరీ సైన్స్‌కు 'పొన్నాల' బంగారు పతకం

- వీసీకి రూ.5.50లక్షల చెక్కు అందజేత
- గోల్డ్‌మెడల్ అందించేందుకు ముందుకొచ్చిన బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య



బంగారు పతకం ఇచ్చే కార్యక్రమానికి చెక్కును ఓయూ వీసీకి అందజేస్తున్న మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 21: ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రెరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బంగారు పతకం ఇచ్చేందుకు వర్సిటీ పూర్వ విద్యార్థి, మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర నేత పొన్నాల లక్ష్మయ్య ముందుకువచ్చారు. పొన్నాల ఫౌండేషన్ ద్వారా ఈ పతకాన్ని అందించనున్నారు